# 26. ఎవరు బాధ్యులు ?

"అయ్యా ! మీకే చెప్పేది ! కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో సీట్లు ఉంటాయి. బెర్తులు లేవు. ఇది ఫస్టు క్లాసు వెయిటింగ్ రూము. రెండో తరగతిలో బెర్తులు రిజర్వయితే ఇందులో పడుక్కోనిస్తారు. కాని కృష్ణాకి బెర్తుల్లేవు కదా ! కాబట్టి మరెక్కడో ఈ రాత్రికి ఇబ్బంది పడండి". అంది వయసులోనున్న బేరరు.

"అమ్మాయ్! ఈ విషయాలన్నీ నాకు తెలుసు. ఇక్కడికి రాక ముందే స్టేషనికి అటువేపుండే సత్రవులోను, ఇటు వేపు సత్రవులోను గది కోసం ప్రయత్నించాను. కొండ మీద చాల మంది పని వాళ్ళ యిళ్ళు విరక్కొట్టి తిరిగి కడుతున్నారట. అందుచేత వాళ్ళ కుటుంబాలని వీలయినంత వరకు ఈ సత్రవుల్లో నింపేశారు. నాలుగయిదు హోటళ్ళలో గది కోసం ప్రయత్నం చేశాను. అసలు గదులు లేవు. ఒకటో రెండో దొరికినా బాగులేవు. టిక్కెట్టు కొనుక్కున్నాను. నువ్వన్నట్లే ఉదయం ఎక్స్‌ప్రెస్‌లో సీటు మాత్రమే రిజర్వయింది. పగలల్లా క్యూలో నిలబడి చాల ఎండబడిపోయాను. మామూలు యాత్రికుడిగా అన్ని యిబ్బందులూ పడి ఇక్కడికి చేరుకున్నాను." అన్నాడా ప్రయాణికుడు.

అతని దగ్గిర అటాచీ మాత్రమే ఉంది. మనిషి ముఖం చెమటలు ఆరిపోయి జిడ్డోడుతూ ఉంది. తలమీద జుత్తు చెదిరింది. మాటి మాటికి అతను కళ్ళొద్దాలు బుష్ షర్టుకి తుడుచుకుంటున్నాడు.

"అన్నీ బాగానే ఉన్నాయ్! నాది పగలు డ్యూటీ. సాయంకాలం ఏడు గంటలకే వెళ్ళి పోయేదాన్ని. నా రిలీవరింకా రాలేదు. నేనేదో ఘొత్తబడి మిమ్మల్ని లోపలికి రానిచ్చినా, ఆవిడ మాత్రం విధిగా మిమ్మల్ని పైకి పంపుతుంది. చండశాసనురాలు! రైల్వే రూల్సన్నీ ఆమెకే తెలుసు. అప్పుడు మీరు విచారించవలసి ఉంటుంది. ఇప్పుడే ప్లాట్ ఫారమ్ మీద ఏదో బెంచి చూసుకుని కూర్చుంటే మంచిది. వేళ మించితే కొండ దిగిన మనుష్యులు నిండిపోయి ప్లాట్‌ఫారమ్ మీద జాగా కూడ దొరకదు."

"ఆవిడ వచ్చే లోగా స్నానం చేసి బట్టలు మార్చుకుంటాను. ఆమెను బ్రతిమాలుకుంటాను. అంతకీ కాదంటే పైకి పోతాను. అంత వరకు నన్ను లోపల ఉండడానికి సమ్మతించు".

"మీరు పెద్దమనుషులు. అంతకు మించి ఏం చెప్పేది? ఆమె నిర్మొహమాటంగా పొమ్మంటే బాధపడతారు."

అతను మరేం మాట్లాడలేదు. బేరరును దాటుకుని వెయిటింగ్ రూమ్‌లోకి ప్రవేశించి, మళ్ళా వెనక్కి వచ్చాడు.

"ఇంతకూ, రాత్రి డ్యూటీ బేరరు పేరేమిటి?"

"చంద్రమ్మ!"

చంద్రమ్మ పేరు రెండు సార్లు మననం చేసుకుని అతను లోపలికి పోయాడు. టేబిలు మీద అటాచీ ఉంచాడు. సబ్బుపెట్టి, తువాలు తీసుకుని స్నానాల గదిలోకి ప్రవేశించాడు. పైపులోంచి పడ్డ నీళ్ళు చాల వేడిగా ఉన్నాయి. బాల్టీలో నీళ్ళు పట్టి, అవి చల్లారడానికి ఓ పది నిమిషాలు వేచియుండి, స్నానం ముగించుకొని వచ్చాడు.

అతను తిరిగి రూములోకి వచ్చే సరికి గేటు దగ్గిర పగలు డ్యూటీ బేరరు లేదు. ఆమె జాగాలో ఒక కుర్రాడు స్టూలు మీద కూర్చున్నాడు.

ఆ ప్రయాణికుడు పలుచని పంచ అటాచీ లోంచి తీసి కట్టుకున్నాడు. బనియను తొడుక్కున్నాడు. తువాలు టేబిలు మీద ఆరేశాడు. తల దువ్వుకొని కుర్చీ మీద కూర్చున్నాడు.

అప్పుడో ఆవిడ సుడిగాలిలా వెయిటింగ్ రూమ్‌లోకి ప్రవేశించింది. ఆమె చక్కని షిఫాన్ చీర కట్టుకుంది. మాచింగ్ బ్లౌజు తొడుక్కుంది. చక్కగా చుట్టిన ముడిలో పూల దండలు తురుముకుంది. ఆమె ముఖం మీద స్పష్టంగా పెద్ద బొట్టు కనిపిస్తోంది. తెల్లటి రుమాలుతో ముంగురులు పక్కకు తోసుకొని, గది నలుపక్కల సామాను కోసం చూసి, తరువాత కుర్చీమీద కూర్చున్న ప్రయాణికుడి దగ్గిరికి విసురుగా వచ్చింది!

"అయ్యా! మీది టిక్కట్టా, పాసా!" ఆమె అడిగింది.

"టిక్కెట్టు" అన్నాడతడు.

"పుస్తకంలోకి ఎక్కించారా?"

"లేదు."

గేటు దగ్గిర చిన్న టేబిలు మీద మున్న రిజిస్టరు అతని ముందు పెట్టి, తిరిగి వెనక్కు పోయింది. తలుపు దగ్గిరున్న ఇందాకటి కుర్రాడు ఇంకా వెళ్ళిపోలేదు.

"ఒరేయ్ రాముా! నేనొచ్చేదాకా ఉండు."

జవాబు వినకుండా ఆమె గాలివానలా వెళ్ళిపోయింది.

కుర్చీ మీద కూర్చున్న ప్రయాణికుడు అన్నీ చూస్తూ మెల్లిగా తలూపాడు. ఎదురుగుండా టేబిలు మీద ఆమె తెరచిన రిజిస్టరు మూసివేశాడు. పది నిమిషాలు ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. తరువాత ప్లాట్ ఫారమ్ మీద నాలుగు అరటి పళ్ళు కొని తెచ్చుకొని తిన్నాడు.

తొక్కలు వేస్టు బాస్కెట్‌లో జాగ్రత్తగా పడేశాడు. అటాచీ నుంచి ఒక బల్ల పరుపు సీసా తీసి మంచినీళ్ళు తాగాడు. ఇంకా మరో పది నిమిషాలు అలా కూర్చున్నాడు. చేతి వాచీ

చూసుకున్నాడు. ఎనిమిదిన్నర దాటింది. కుర్చీలో కూర్చోడానికి ఓపిక మరి లేక, ఆరిపోయిన తువాలు నేల మీద పరుచుకొని, తల కింద అటాచీ ఉంచి, పక్కన ఫంట్లాము, బుష్ కోటు పెట్టుకొని పడుక్కున్నాడు.

అతనికి నిద్ర పట్టింది.

ఉన్నట్లుండి అతనికి తెలివి వచ్చింది.

వెయిటింగ్ రూమ్ ద్వారం వేపు అతను చూశాడు.

ద్వారం దగ్గిరే ఉన్న టేబిలు ముందు ఇందాకటి కుర్రాడే నిలబడి ఉన్నాడు. కుర్చీలో రాత్రి డ్యూటీ బేరరు కాబోలు, కూర్చుంది. ఆమె తెల్లటి చీర కట్టుకుంది. తెల్ల రవిక తొడుక్కుంది. ఆమె జడముడిలో పూల సరాలు లేవు.

ఆమె కుర్రాడి నడుగుతోంది.

"ఇంకా నీలమ్మేం చెప్పింది?"

"నువ్వు చండశాసనురాలవని, రూల్ మాస్టరువని చెప్పింది. ఇంతకీ ఆ మనిషి రేపు కృష్ణాలో పోతున్నాడు. బతిమాలుకున్నాడు. స్నానం చేసుకోడానికి, బట్టలు మార్చుకోడానికి అనుమతి యిమ్మన్నాడు. చంద్రమ్మా సెకెండు క్లాసు టిక్కట్టు వాడిని ఇందులో ఉంచొచ్చా?" అన్నాడు కుర్రాడు.

ఇంతలో ఒక పెద్ద కుటుంబం వచ్చింది. పిల్లలూ, పెద్దలూ, అన్ని వయసుల వాళ్ళూ ఉన్నారు. అందులో ఒక నడివయసు వాడు రిజర్వేషన్ టిక్కట్లు బేరరుకి చూపించాడు.

"రాత్రి పదకొండున్నర బండికి వెళ్ళిపోతాం, కొంచెం పడుక్కోనీ, తల్లీ"

"అలా ఆ బాబుగారి పక్కను పడుక్కోండి."

వాళ్ళందరూ గోల చేస్తూ లోపలికి ప్రవేశించారు.

"పాపం! ఎక్కడా చోట్లేదు. అందరికీ రిజర్వేషన్లున్నాయి. ఇంకా మరో రెండు గంటలు. ఇంతకీ, మీరు పుస్తకంలో పేరెక్కించారా?" చంద్రమ్మ మొదటి ప్రయాణికుడిని ప్రశ్నించింది.

"లేదు!"

ఇంతలో పోర్టరొకడు ద్వారం దగ్గిర నిలబడి చంద్రమ్మను పిలిచాడు.

"చంద్రమ్మా! నీతో ఓ రహస్యం! ఇందాకో పెద్దమనిషి నీలమ్మతో మాట్లాడుతుంటే చూశాను. అతడెవడో తెలుసా? గండల మిండడు. చీఫ్ విజిలెన్సు ఆఫీసరు, వెంకటేశ్వర్లు. సికిందరాబాదు హెడాఫీస్ నుండి వచ్చాడు. రెండు నెల్ల క్రింద స్టేషనులో ఎంక్వయిరీ చేసి ఇద్దరి ఉద్యోగాలు పీకి పారేశాడు. టిక్కట్టు కొన్నానని నీలమ్మతో అంటున్నాడు. ఏదో మతలబుంది. మంచిగా పంపించీ!"

చంద్రమ్మ గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. లోపలికి ప్రవేశించిన వాళ్ళు, ముందు వచ్చిన పెద్దమనిషిని తగులుతూ దుప్పట్లు పరిచి పడుక్కుంటున్నారు.

"ఏయ్! మీకు బుద్ధి లేదా? మా దొరగారి మీద పడిపోతున్నారేమిటి? దూరంగా పొండి!" కేకవేసింది చంద్రమ్మ.

తరువాత మొదటి ప్రయాణికుడి తల దగ్గర వంగి మెల్లగా అంది.

"సార్! తమరిలా వెయిటింగ్ రూములో నేలను పడుక్కొని యిబ్బంది పడుతున్నారు. రిటైరింగ్ రూముల్లో ఏ.సి ఛాంబరొకటి ఖాళీగా ఉంది. నేను స్టేషను సూపరింటెండెంటుకి ఫోను చేసి పెర్మిషన్ తీసుకుంటాను".

అప్పుడు వెంకటేశ్వర్లు లేచి కూర్చున్నారు.

"చంద్రమ్మా! నేను అందరికి మల్లే మామూలు ప్రయాణికుడిని. సాధారణ యాత్రికుడిగా కొండెక్కి స్వామి వారిని చూసి వచ్చాను. రెండో తరగతి టిక్కెట్టు కొనుక్కున్నాను. రేపు ఉదయం వెళ్ళిపోతున్నాను. నిజానికి, ఇందులో పడుక్కునే అర్హత లేని వాడిని. ఈ రోజు బాగా ఎండ పడి పోయాను. కొంచెం విశ్రాంతి తీసుకోదలచి మిమ్మల్ని యిరుకులో పెట్టాను. ఇప్పటికి చేసినదే చాల తప్పని నా మనసు బాధపడుతోంది. దానిమీద మరో పెద్ద తప్పు చేసి ఏ. సి ఛాంబరుకి ఏ ముఖం పెట్టుకొని పోను?"

చంద్రమ్మకు కాళ్ళాడడం లేదు.

ఇందాకటి పోర్టరు ప్లాట్ పారమ్ మీద తచ్చాడుతున్నాడు.

చంద్రమ్మ వెయిటింగ్ రూము విడిచి పైకి వచ్చింది.

"చంద్రశేఖరం! అతనెందు కొచ్చాడో తెలుసా?" ఆమె పోర్టర్ని అడిగింది.

"నీలమ్మ చెప్పడం - నీ పేరడిగాడని."

"ఎప్పుడు ? "

"నీకోసం ఆవిడ చూసి విసిగెత్తి నప్పుడడిగాడు. ఎప్పటికీ నువ్వు రాకపోతే తాళాలు రామూకిచ్చి వెళ్ళిపోయింది. మీరిద్దరూ తప్పు చేశారు. రిలీవరు రాందీ నీలమ్మ వెళ్ళకూడదు. ఉద్యోగానికి ఆలస్యంగా వచ్చి, మళ్ళా వెళ్ళిపోయి, ఎవడో కుర్రాడికి తాళాలప్పగించడం నువ్వు చేసిన తప్పు. మీ యిద్దరికీ ఉద్యోగాలు పోతాయనడంలో సందేహం లేదు."

"మరేదీ దారి లేదా?"

"లేకేం! రెండు దారులు. ఒకటి డబ్బు! రెండోది వయసులో నున్న ఆడది.నీకు రెండు విధాల లోటు లేదు."

చంద్రమ్మ మాట్లాడలేదు. తిరిగి వచ్చి, లోపల తన కుర్చీ మీద కూర్చుంది. హాండ్ బాగ్ తీసి చూసుకుంది. అందులో రెండు, వంద రూపాయల నోట్లు ఉన్నాయి. అవి సరిపోతాయా? ఆమె నవ్వుకుంది. అందమంతా తనదే అనుకుంది. చంద్రమ్మ.

* * * *

రాత్రి పదకొండు గంటలకు బండి ప్లాట్‌ఫారమ్ మీద పెట్టడమేమిటి, లోపల పకుక్కున్న ఆ కుటుంబం వారిని లేపేసింది చంద్రమ్మ.

"మీ రిజర్వేషన్లు చూసుకొని బండిలో పడుక్కోండి."

వాళ్ళు ఒకరూ ఒకరూ లేచి, ఏడుస్తున్న పిల్లలను ఎత్తుకొని, సామాను పట్టుకొని, ప్లాట్‌ఫారమ్ మీదికి వెళ్ళిపోయారు.

చీఫ్ విజిలెన్స్ ఆఫీసరు వెంకటేశ్వర్లు గురించి చంద్రమ్మ కూడా వింది. అతనికి మొహమాటమన్నది లేదు. పెద్ద పెద్ద ఆఫీసర్లే అతనంటే గడగడలాడతారు. తన ఉద్యోగం తీసేయడానికి అతనికి మరే సాక్ష్యాలూ అక్కర్లేదు.

చంద్రమ్మ లేరి పచారులు చేసింది. పన్నెండు గంటలయింది. ప్లాట్ ఫారమ్ మీద నున్న రైలు యింకాకదల్లేదు. ఆమె టేబిలు సొరుగులోంచి చందనం సబ్బు తీసి స్నానాల గదిలోకి పోయింది.

ఆమె బాత్ రూము నుంచి వచ్చేసరికి ప్లాట్ ఫారమ్ మీద నున్న రైలు వెళ్ళిపోయింది. జీవన్మరణ సమస్యను ఎదుర్కోడానికి అన్ని విధాల చంద్రమ్మ ఆయత్తమయింది.

వెయిటింగ్ రూము తలుపులు, కిటికీలు మూసింది. కర్టెన్లు లాగింది, పైనున్న వెలుతురు లోపలికి రాకుండా. పర్సులోని పెద్ద నోట్లు తీసి పట్టుకుంది. రూములో వెలుగుతున్న ఒక్క లైటు కూడా ఆర్పేసింది. మెల్లిగా అడుగులు వేసుకుంటూ పడుక్కున్న వెంకటేశ్వరులు వైపు నడిచింది.

అతను బాగా అలసి పోయి ఉన్నారేమో, లోపల ఒకింత చల్లగా ఉండడం నుంచి ఒళ్ళు మరచి నిద్రపోతున్నారు.

చంద్రమ్మ అతని కాళ్ళ దగ్గిర కూర్చుంది. నోట్లు రెండూ మెడలో దోపుకుంది. జాకెట్టు, బాడీ విప్పివేసింది. వంగి అతని కాళ్ళు పట్టడం మొదలు పెట్టింది.

అతనేదో కలగంటున్నారు కాబోలు! భార్య కాళ్ళు పడుతున్నదని అనుకున్నారు. అయిదు నిమిషాల వరకు సంవాహన సుఖం అనుభవించారు. కొంచెం కొంచెం అతనికి తెలివొచ్చింది. ఒక్కసారిగా అతను లేరి కూర్చున్నారు.

"సార్! తమరు చాల అలిసి పోయారు. కొంచెం మీ సేవ చేయనియ్యండి"

చంద్రమ్మ పైట పక్కకు తొలగించి, అతనిని తన చేతుల్లోకి తీసుకుంది.

అతను పూర్తిగా ఈ లోకంలోకి వచ్చేసరికి మరో అయిదు నిమిషాలు పట్టింది.

మెల్లిగా ఆమె నుండి కొంచెం ఎడమయి, చాల నెమ్మదిగా, ఏ కోపమూ ప్రకటించకుండా అన్నాడు. ఆమె యౌవన్నాన్ని కనులార చూసి,

"ఎవరికీ తెలియ జేయకుండా యాదగిరి ఎందుకు పెళ్ళి చేసుకున్నాడని నేను చాల కాలం ఆలోచించాను. ఇవాళ నాకు ఆ కారణం తెలిసింది."

చంద్రమ్మ తన భర్త పేరు అతను చెప్పగానే షాక్ తిన్నట్లు బాధ పడింది.

మొలలో దోపిన రెండు పులి బుర్ర నోట్లు తీసి, అతని చేతిలో పెట్టి అంది: "సార్! ఇవి తమ తాంబూలం ఖర్చుకి!"

అతను నవ్వారు.

"చంద్రమ్మా! ముందు బట్టలు సరి చేసుకో! ఈ నోట్లు భద్రంగా దాచు. నిన్ను కలిసి, చాల విషయాలు మాట్లాడాలని ప్రత్యేకంగా సికిందరాబాదు నుండి టిక్కట్టు పెట్టుకొని వచ్చాను. నీ ఉద్యోగంలో లోటుపాట్లు తెలుసుకొని, నిన్ను శిక్షించవలసి ఉంటే ఎనిమిది చక్రాల సెలూనుమీద వచ్చి, మీ స్టేషను సూపరింటెండెంటు గదిలో ఎంక్వయిరీ చేసి, నిన్ను శిక్షించి ఉండేవాడిని, కాని, నీకు మళ్ళా చెప్తున్నాను, నేను నీకు ఆప్తుడిగా వచ్చాను - చర్య తీసుకోడానికి కాదు"

ఆ మాటలు వింటుంటే చంద్రమ్మ గుండెలు కొట్టుకున్నాయి. ఎనిమిది చక్రాల సెలూను, స్టేషను సూపరింటెండెంటు ఎదుట ఎంక్వయిరీ - ఈ మాటలు వినగా ఆమె కు కాళ్ళాడలేదు. కాని, అతని చివరి మాటల్లో ఏదో అభయం లభించినట్లయింది.

చంద్రమ్మ విడిచిన బట్టలు తిరిగి తొడుక్కుంది. నోట్లు హాండ్ బ్యాగ్‌లో దాచింది. వచ్చి వెంకటేశ్వర్లుకి సమీపంలో కూర్చుంది.

"చంద్రమ్మా! నిన్నో రెండు ప్రశ్నలు ముందుగా అడుగుతాను. తరువాత చెప్పవలసిన వాటి గురించి ఆలోచించవచ్చు."

"బాబుగారూ అడగండి"

"ఇవాళ ఉద్యోగానికి ఆలస్యంగా ఎందుకొచ్చావు? నువ్వు చాల కరెక్టయిన మనిషివని, రూల్ మాస్టరువని పగటి డ్యూటీ మనిషి చెప్పింది."

"పని మీద చిత్తూరు వెళ్ళి వచ్చాను. ముందు బస్సు తప్పిపోయింది."

"మంచిదే! ఎనిమిది గంటల తరువాత, డ్యూటీ డ్రస్ వేసుకోకుండా ఉద్యోగానికొచ్చి వెంటనే వెళ్ళిపోయావు. మరో గంట వరకు తిరిగి రాలేదు. కారణమేదేనా ఉందా?"

"మా యిల్లు ఊళ్ళో చివరి వీధిలో ఉంది. అప్పటికీ రిక్షా కట్టించుకొని పోయాను. ఆలస్యం తప్పలేదు"

"చంద్రమ్మా! నువ్వు దూరం వెళ్ళనక్కరలేకుండా, స్టేషనుకు దగ్గరే రైల్వే యిల్లిచ్చారు. మరి ఊరవతల కెందుకు పోయావు?"

చంద్రమ్మకు చేతులూ, కాళ్ళూ ఆడడంలేదు.

"చెప్పు చంద్రమ్మా, నా దగ్గిర నీకేం భయం లేదు."

"రైల్వే యిల్లు అద్దెకిచ్చాను"

"దానికేమైనా కారణముందా?"

చంద్రమ్మనవ్వింది. ఆమె పలువరుస పలుచని వెలుతురులో మెరిసింది.

"చెప్పమన్నారా?"

"నిస్సందేహంగా!"

"నాకోసం వయసులోని మగాళ్ళు అప్పుడప్పుడు రావడం కద్దు. ఇరుగు పొరుగులు చూసి ఏమనుకుంటారు? పిల్లలతో సంసారాలు చేసే వారి మధ్య ఇటు వంటి పనులు బాగోవు."

"అవునవును"

అతనికి మరి అడగడానికి ప్రశ్నలు లేవు. ఒక్క అయిదు నిమిషాలు ఇద్దరూ ఏమాటలూ లేకం డా కూర్చున్నారు.

తరువాత వెంకటేశ్వర్లే నిశ్శబ్దాన్ని భంగం చేశారు.

"చంద్రమ్మా! నీతో నాలుగు సంగతులు మాట్లాడి, నేనొచ్చిన పని పూర్తి చేసుకుని, ఉదయమే వెళ్ళిపోవాలి. అప్పుడే రెండుగంటలవస్తోంది. సావధానంగా విను. నువ్వు చెప్పవలసినవి నిర్భయంగా చెప్పు."

"బాబుగారూ! తప్పకుండా!"

"చాలాకాలం క్రిందటి మాట, పద్దెమిది సంవత్సరాల క్రిందటిది. అప్పుడు నేను బెజవాడలో కమర్షియల్ ఆఫీసరుగా పనిచేస్తూండేవాడిని. అక్కడ పాలు పెరుగులకు లోటు లేకపోయినా, మా అమ్మగారికోసం ఓ నల్లావుని, చూలుతో ఉన్నదాన్ని, కొన్నాను. దాని సంరక్షణ కోసమని ఓ మనిషిని చూడమని మా హెడ్ గుమాస్తాతో చెప్పాను. నేను చెప్పిన వారం రోజులకో పదేళ్ళ కుర్రాడిని అతను తీసుకొచ్చాడు. ఆ అబ్బాయి కొంచెం అర్భకంగా ఉన్నాడు. రైతు కుటుంబం వాడని, ఆవును చూడడమే కాకుండా పాలు కూడా పితగ్గలడని అతను చెప్పాడు. ఆ కుర్రాడికి కావలసిన వాళ్ళెవరూ లేరు. కాబట్టి బస, భోజనం కూడ మమ్మల్నే ఏర్పటు చేయమని గుమస్తా అన్నాడు. బంగళాకు సర్వెంటు క్వార్టర్సు ఎప్పుడూ ఉంటాయి. ఒకటి కాళీ చేయించి ఆ కుర్రాడికిచ్చాను. ఆ రోజు నుండి యాదగిరి పది సంవత్సరాలు మాతోనే ఉన్నాడు. ఈ సంగతి నీకెప్పుడైనా చెప్పాడా?"

చంద్రమ్మ ఆలోచించి మరీ అంది:

"కలలో కూడ ఒకసారీ అనలేదు"

"సాధారణంగా నీతో తన పని గురించి కాని, పై అధికార్ల గురించి కాని యాదగిరి చెప్పేవాడా?"

"అప్పుడప్పుడు చెప్పేవాడు. ఆ చిన్న మాస్టరు మంచివాడు కాడని, ఈ కాబిన్ మాన్ పేచీ కోరని చెప్పేవాడు. ఎప్పుడూ ఎవరికో భయపడుతూ ఉండేవాడు."

"చాల వింతగా ఉందే! యాదగిరి మా దగ్గరనున్న పది సంవత్సరాలలోనూ మాకు దగ్గిర చుట్టమయి, మా యింట్లో ఒక మనిషిగా ఉండేవాడు. వారాల తరబడి, బంగళా యాదగిరి మీద విడిచి పెట్టి వెళ్ళే వాళ్ళము. మా పిల్లలకు యాదగిరి తల్లో నాలుక. నాకు చాల తక్కువ అవసరాలుంటాయి. వాటిని కూడా నేను శ్రమపడకుండా వాడే అన్నీ చూసుకునేవాడు. నా జోళ్ళు, చెప్పులు, నేను క్యాంపుకు పోయే టప్పుడు కావలసిన వస్తువులు, ఇదీ అదీ ఏమిటి, చాల జాగ్రత్తగా అన్నీ అమర్చేవాడు. వాడు మాతో ఉన్న పది యేళ్ళ లోను ఆవులు పెంచడానికి మాకెటువంటి యిబ్బంది కలుగలేదు. వాడు ఉద్యోగానికి పోయిన ఆరునెలల్లోను ఉన్న ఆవుల్నీ, పెయ్యల్నీ ఎవరెవరికో ఇచ్చేశాను."

చంద్రమ్మ శ్రద్ధగా వింటోంది. పది సంవత్సరాలు, చండశాసనులు వెంకటేశ్వర్లుగారికి ఏ లోటూ లేకుండా, అతనిదన్న ఏ చిన్న పనీ మరచిపోకుండా శ్రమపడ్డ మనిషి యాదగిరి.

"నేను సికిందరాబాదు పెద్దాఫీసుకు చేరుకున్న తరువాత యాదగిరికి ఇరవై యేళ్ళు వచ్చాయని, వాడికో ఉద్యోగం, తరువాత భార్య అవసరమని నా భార్య చెప్పింది. యాదగిరికి ఉద్యోగమిప్పించి మా తోనే ఉంచుకుందామని ఆమె అంది. నేను మాత్రం ఆ సూచనను ఆమోదించలేదు. వాడి ఆలోచనలు వాడినే ఆలోచించ మన్నాను. వాడి బ్రతుకు వాడినే బ్రతకమన్నాను. సికిందరాబాదులో వాడు మా తోనే ఉంటే, వాడు మా పనులే చేస్తాడు. అందుచేత మాకు దూరంగా రేణిగుంటలో వాడికి ఉద్యోగం వేయించి పంపించాను. ఎప్పుడైనా తన ఉద్యోగం గురించి నీతో చెప్పాడా, చంద్రమ్మా?"

"అతనెప్పుడూ, పొరపాటుగానైనా, ఈ సంగతుల్లో ఒకటి కూడా చెప్పలేదు"

"అవును. నేను వాడికి ఉద్యోగం వేయించినప్పుడు వాడినో సంగతి ముఖ్యంగా గుర్తుంచుకోమన్నాను. వాడు నా మనిషని ఎవరికీ తెలియజేయవద్దన్నాను. అందుకే యాదగిరి ఎవరో తెలియని ఈ ప్రాంతాలకు వాడిని పంపించాను. దానికి మరేదీ పెద్ద కారణం లేదు. యాదగిరి నా దగ్గిర చనువుగా ఉండేవాడని తెలిస్తే, వాడి ద్వారా ఎవరేనా నన్ను యిబ్బందులలో పెడతారని ఆ విధంగా చెప్పాను."

"బాబుగారూ! మీ కింద పనిచేసేటప్పుడు అతను మీ మాట మీరలేదు. స్వతంత్రంగా బతుకుతున్నా మీ ఆజ్ఞను మరిచిపోలేదు".

"చంద్రమ్మా! ఈ సందర్భంలో నీకో సంగతి చెప్పాలి. యాదగిరి ఉద్యోగంలో చేరిన తరువాత ఏదో రోజు మా యింటికి వచ్చి, మమ్మల్ని చూసి పోతాడని అనుకున్నాను. కాని.... తిరిగి వాడు మా గుమ్మం తొక్కలేదు".

"ఇది చాల విచిత్రంగాఉందే!"

"వాడి గురించి నా భార్య చాల కాలం మరిచిపోలేదు. చెయ్యి విరుచుకున్నట్లే బాధపడింది. వాడు చాల బిడియం కలవాడు. అన్నం కూడా సరిగా తినే వాడు కాదు. కాలు

కొచ్చినా, జ్వరమొచ్చినా చెప్పేవాడు కాదు. వాడిని తల్లిలా అభిమానంతో చూసింది. కొసరి కొసరి తిండి పెట్టింది. మందులిప్పించింది. ఆ విధంగా ఆమె వాడి మీద మమకారం పెంచుకుంది. వాడి మనస్తత్వానికి అనుగుణంగా ఉండే పిల్లనొకర్తెను చూసి వాడికి ఉత్తరం రాయమని నాకు చెప్పింది.''

చంద్రమ్మ వింటోంది.

"నేను పని తొందర్లో వాడికి ఆరు నెలల వరకు ఉత్తరం రాయలేదు. ఉన్నటుండి ఒక రోజు వాడి దగ్గిర నుంచే ఉత్తరం వచ్చింది. రైల్వే ఉద్యోగి కూతుర్నొకర్ని పెళ్ళి చేసుకున్నట్లు, ముందుగా తెలియజేయలేక పోయినందుకు క్షమించమంటూ రెండేముక్కలు రాశాడు. చంద్రమ్మా! ఈ రోజు నాకు తెలిసింది, యాదగిరి అంత తొందరగా నిన్నెందుకు పెళ్ళి చేసుకున్నాడో!''

"అవును బాబుగారూ! దానికి కారణం నేననుకుంటాను. ఆరు నెలలు మా నాన్న యాదగిరి మెడలు వంచి నన్నిచ్చి పెళ్ళి చేద్దామనుకున్నాడు. కాని, ఆ పిరికి మనిషి ఇవాళ, రేపు అంటూ వెనక బెట్టాడు. ఒకరోజు ఎవరూ లేకుండా ఉన్నప్పుడు తలుపు తోసుకుని మా యింట్లోకి వచ్చాడు. అపుడు నేను స్నానం చేసి తడి బట్టతో యింట్లోకి వస్తున్నాను. పలుచని తువాలు ఒంటికి చుట్టుకున్నానేమో, నా శరీరాన్ని అతని చూపుల్లోంచి దాచలేక పోయాను. ఒక్క అయిదు నిమిషాలు అతను కనురెప్పలు వాల్చకుండా నన్ను చూస్తూ ఉండిపోయాడు. ఆ సాయంకాలమే అతను మా తండ్రితో చాల సేపు మాట్లాడి వారం రోజుల్లో పెళ్ళి జరిపించుకున్నాడు. కాబట్టి మీ ఊహ సరి అయిందే!''

వెంకటేశ్వర్లు ఒక పది నిమిషాలు మాటల్లేకుండా ఆలోచిస్తూ ఉండిపోయారు. తరువాత అన్నారు.

"చంద్రమ్మా! నువ్వు చదువుకున్న దానికి మల్లే కనిపిస్తున్నావు. జీవితం మీద నీకు ఒక అభిప్రాయం ఏర్పడినట్లుంది. నీ మాటల బట్టి చూస్తే, నువ్వు కూడా యాదగిరిని పెళ్ళాడడానికి ఒప్పుకున్నట్లు కనిపిస్తుంది. మగవాడికి చాల బాధ్యతలుంటాయి. అటు ఉద్యోగం, ఇటు సంసారం - అందుచేత అతనిలో ఏవేనా లోపాలుంటే నీ వంటి భార్య దిద్దుకొని ఉండవలసింది"

"బాబుగారు! నేను తొమ్మిదో తరగతి దాకా చదువుకున్నాను. తెలుగు నవలలు, కథలు చాల చదివాను. మా యింట్లో నాకేం కొదవలేదు. మా తల్లిదండ్రులు ఒకరినొకరు అర్థం చేసుకున్న వాళ్ళు. మా నాన్న ఇంటి బరువంతా భుజాలమీద వేసుకున్నవాడు. అందుచేత అందరు మగాళ్ళు అతనికి మల్లే ఉంటారని అనుకున్నాను.''

"మరి యాదగిరిలో నీకేం లోపం కనిపించింది?''

"పెళ్ళయిన తొలి రోజుల్లో మగడి మీద అనురాగం కన్న గౌరవమే హెచ్చుగా నిలిపి

కాపురం చేశాను. మా వాళ్ళు నాకు ఏ లోటు చెయ్యలేదు. మంచి సారె పెట్టారు. అన్ని విధాల సహాయం చేశారు. అటువంటి పరిస్థితులలో నేనేం కోరుతాను? ఆలుమగలం ఆనందంగా కాలం గడపాలని కోరాను. నా ఆశలన్నీ వమ్మయ్యాయి. నాకు తాళికట్టిన వాడు సుతరాం ధైర్యం లేని వాడని, స్వయంనిర్ణయశక్తి లేని వాడని నాకు తెలుసుకోడానికి అట్టే కాలం పట్టలేదు. అతని భయాలకు కారణమేదో తెలుసుకుందామని ప్రయత్నించాను. కాని, అతను ఇంకా ఇంకా ఏకాంతాన్ని కోరుకొని, మనస్సు ఎక్కడో పెట్టుకొని, అన్ని విధాలైన సౌఖ్యాలు అందుబాటులో నున్నా తాను హాయిగా ఉండలేక పోయాడు; నన్ను సంతోష పెట్టలేక పోయాడు."

"చాల ఆశ్చర్యంగా ఉందే"

"ఈ విధంగా రెండు సంవత్సరాలు అతనితో కాపురం చేశాను. అతను తన ఆరోగ్యాన్ని చెడగొట్టుకోడమే కాకుండా, నా ఆరోగ్యం పాడు చేశాడు. అప్పుడు తెలివి తెచ్చుకుని అతనికి అన్ని విధాల సహాయం చేయడానికి, అతని జీవితాన్ని సుఖమయం చేయడానికి ప్రయత్నాలు చేశాను. ఆ విధంగా మరో మూడు సంవత్సరాలు గడిచి పోయాయి. ఈ అయిదు సంవత్సరాలలోనూ నాకో అమ్మాయి కలిగింది. పిల్లలు పుడితే ఎడంగా నున్న భార్యా భర్తలు దగ్గిరపడతారంటారు. కాని, అతను మాత్రం రోజు రోజుకు దూరమయాడు. అప్పుడప్పుడు నన్ను సంతోష పెట్టడానికి బట్టలు కొని, చిన్న చిన్న ఆభరణాలను చేయించి నా అనురాగాన్ని కొనుక్కోడానికి ప్రయత్నించాడు. దానికే నేను సంతోషించి నన్ను నేను అర్పించుకున్నాను. అతను సుఖ పడడానికి బదులు అనుమానాలు పెంచుకున్నాడు. నేను నటిస్తున్నానని ఒక నమ్మకానికి వచ్చాడు"

"చూడు చంద్రమ్మా! నువ్విన్ని చెప్తున్నావు. నాకు నమ్మాలో, నవ్వాలో తెలియడం లేదు. విశ్వాస పాత్రులైన మనుషుల్లో యాదగిరి మొదటి వాడని నా అభిప్రాయం. అంత మంచి ప్రవర్తన కలవాడు ఒక్కసారి ఎలా మారిపోతాడు?"

"బాబుగారూ ఒక్క ప్రశ్న వేస్తాను. మీ యాదగిరి చాల మంచి వాడే! నేను కాదనను. ఎవరి జోలికి పోడు. ఎవరినీ నిందించడు. తనూ, తన పని, తన యిల్లూ తప్ప మరేవీ అక్కరల్లేని వాడు. మరి, కొడుకులా పెంచిన మిమ్మల్ని ఒక్కసారేనా చూడగలిశాడా? మీ మాటకేం - మగాళ్ళు - అమ్మగారినైనా చూసి, వారి పాదాలు కళ్ళ కద్దుకున్నాడా? స్వంత బిడ్డడివలె ఆమె చూసుకున్నారు కదా!"

"అదే, నాకూ అంతు పట్టడం లేదు."

"బాబుగారు! అట్టే చెప్పి మిమ్మల్ని విసిగించలేను. అయిదేళ్ళయి ఇంటి పట్టున ఉన్న మనిషి ఒకరోజు రిలీవింగ్ డ్యూటీకి వెళ్ళి పోయాడు. ఏ పది రోజులకో వచ్చేవాడు. తరువాత ఏ రెండు నెల్లకో - జీతం, రిలీవింగులో దొరికిన డబ్బు నా చేతిలో పోసి, తనకోసం చాల తక్కువ ఉంచుకునేవాడు. ఏంచెప్పను! నాకు డబ్బే ప్రధాన మనుకున్నాడో, లేక నన్ను అవమానం

చేయడానికి అలా ప్రవర్తించేవాడో తెలీదు. పై వూళ్లలో భోజన సౌకర్యం లేక, సరియైన విశ్రాంతి లేక, అంతకన్న హెచ్చుగా నే నెవరితో పోతున్నానో అన్న అనుమానంతో అలమటించేవాడు. ఒకరోజు ఇద్దరు మనుషులు అతన్ని ఇంటికి తెచ్చే వరకు నాకతనికి జబ్బుగా ఉన్న సంగతి కూడా తెలియలేదు. పెద్ద పెద్ద డాక్టర్లకు చూపించాను. వారి సలహా ప్రకారం గుంతకల్లు హాస్పిటలులో చేర్చాను. క్రమంగా అతను నా మీద ద్వేషం పెంచుకున్నాడు. నేనంటే మండి పడే వాడు. నన్ను హాస్పిటలుకు రావద్దన్నాడు. అందరిమీద, ఆఖరికి డాక్టర్లమీద అనుమాన పడేవాడు. గుంతకల్లు నుంచి ఒక్కర్తెను వచ్చేశాను. వచ్చిన రెండో రోజు తల దువ్వుకుంటూ ముఖం అద్దంలో చూచుకున్నాను. కళ్ళు లోతులకు పోయాయి. బుగ్గలు దొప్పలు దేరాయి. దట్టంగా ఉన్న జుత్తు పలచబడింది. ఆరు నెలలయి రోగంతో ఉన్న మనిషి ముఖంలా అది కనిపించింది. ఏం చేయడం? ఎంత వరకు నేను దీనికి బాధ్యురాలిని?''

“నువ్వు వాడి పెళ్ళానివి. కాబట్టి నీకు బాధ్యత ఉంది. వాడు అనుమానం పడ్డాడని అంటున్నావు. కారణం లేకుండా వాడు నిన్ననుమానించాడా?''

చంద్రమ్మ కొంచెం సేపు ఊరుకొని తరువాత అంది

“అతని వల్ల సుఖం లేనప్పుడు దారితప్పడం నిజమే. ఎన్ని సంసారాల్లో ఇటువంటి తప్పులు జరగడం లేదు? కాని, అతన్ని నేను ఎప్పుడూ చులకనగా చూడలేదు. రచ్చకీడవ్వలేదు''

“అవునవును''

“అతన్ని గుంతకల్లు నుండి సికిందరాబాదు మెయిన్ హాస్పిటల్‌కి తీసుకు పోయిన సంగతి కూడా నాకు ఆలస్యంగానే తెలిసింది. నేను దూరంగా ఉంటే అతని రోగం తొందరగా తగ్గుతుందనుకున్నాను. అందుచేతనే అతను సికిందరాబాదు హాస్పిటలులో చేరిన నెల రోజుల తరువాతే వెళ్ళాను. అతని రోగం తగ్గడానికి బదులు ముదిరిపోయింది. ఏవో ఇంటి సంగతులు చెప్పి మాట్లాడడానికి ప్రయత్నించాను. అతను పెద్ద కేకలు పెట్టుకుంటూ మంచం మీద నుంచి లేచి పోయాడు. నానా రభస అయింది. అనరాని మాటలు నలుగురిలోను అన్నాడు. అవమానం చేసి పంపించాడు''

“యాదగిరి భార్య చూసి వెళ్ళిందని మాత్రం నాకు తెలిసింది. ఇంత తతంగం జరిగిందని నేనెరుగను''

“తరువాత నేను సికిందరాబాదు మరి పోలేదు. మరో మూడు నెలల్లోనే అతను పోయాడు. దహనానికేనా రమ్మన్నారు. రానని టెలిఫోనులో చెప్పించాను. నేనక్కడికి పోతే అతని ఆత్మ కూడా శాంతంగా పరలోకాలకు పోదు.''

వెంకటేశ్వర్లు ఆలోచిస్తున్నారు. ఓ పది నిమిషాలు అతను బాత్ రూం కి పోయి మళ్ళా చంద్రమ్మ దగ్గిరే కూర్చున్నారు.

“చంద్రమ్మా! యాదగిరి జబ్బుతో ఉన్నాడని, సికిందరాబాదు పంపించారని నాకు తెలీదు. ఒకరోజు ఇనస్పెక్షన్ జరుగుతోంది. ఛీఫ్ మెడికల్ ఆఫీసరు మాకు వార్డులు చూపిస్తున్నాడు.

ఓ వార్డులో యాదగిరి కనిపించాడు. అప్పుడు వాడికి సెలైను ఎక్కిస్తున్నారు. మనిషి బాగా చిక్కి పోయాడు. కళ్ళల్లోనే ప్రాణముంది. ఆ సాయంకాలం యాదగిరి దగ్గరికి నా భార్యను తీసుకొచ్చాను. ఆమె వాడిని చూసి వలవల ఏడ్చింది. డాక్టర్లనడిగితే అది కుదిరే జబ్బు కాదన్నారు. అంతకు మించి మరో విశేషం చెప్పారు. ఆ మనిషికి నిద్ర మాత్రలు, మత్తు ఇంజక్షన్లు పనిచేయడం లేదని, అహోరాత్రాలు దేనిగురించో తీవ్రంగా ఆలోచిస్తూ నిద్రపోవడం లేదని, అందుచేత ఎప్పుడో పోవలసిన వాడు తొందరగా గమ్యం చేరుకుంటున్నాడని అన్నారు. ఇటువంటి పరిస్థితి లో భార్యో, దగ్గరి బంధువులో వాడి దగ్గరుండాలి. వాడి భార్య మరి రాదేమో నని పక్క రోగులు చెప్పారు. అప్పుడు నాకు నవ్వొచ్చింది. నాకన్న, నా భార్య కన్న వాడికి కావలసిన వాళ్ళెవరున్నారు? మా కోసం పది సంవత్సరాలు కష్టపడ్డ మనిషికి ఆ పాటి సేవ చేయలేమా? తరుచు మేము వచ్చి వాడిని చూసే వాళ్ళము. యాదగిరిని మాటల్లో పెట్టి వాడిని బాధ పెడుతున్న విషయం గురించి తెలుసుకోడానికి ప్రయత్నం చేశాను. మొదటి అయిదు సంవత్సరాలు తన కాపురం బాగానే ఉందని, తరువాత ఆమె దారి తప్పిందని వాడు సూచించాడు ఎవరం ఏ విధంగా ఓదార్చినా లాభం లేక పోయింది. ఒక సాయం కాలం నేను చాల సేపు వాడి దగ్గర కూర్చున్నాను. వాడితో ఏవో కబుర్లు చెప్తూ అన్నాను ' నువ్వు ఎనిమిదేళ్ళు పెళ్ళాంతో కాపురం చేశావు. కొన్ని సంవత్సరాలు ఆమె నిన్ను సుఖ పెట్టిందని చెప్తున్నాడు తరువాత దారి తప్పిందన్నావు. కొంచెం ఆలోచిస్తే, నీ భార్య నిన్ను సుఖ పెట్టిన రోజులే హెచ్చు. తరువాత ఆమె ప్రవర్తనను శంకించావు. ఆమెను ద్వేషించావు. ఆమె నీకు అపరిమిత మైన ఆనందమూ యిచ్చింది. నరకయాతనకూ పాల్జేసింది. బ్రతకవలసిన కొద్ది రోజులూ మనసు శాంతి లేకుండా బాధపడుతున్నావు. ఆవిడ గురించే నువ్వు ఆలోచించ వలసి వస్తే ఆమెతో సరదాగా గడిపిన తొలి రోజులు జ్ఞాపకం తెచ్చుకో. కనీసం నువ్వు హాయిగా కళ్ళు మూయొచ్చు.' వాడు నా కళ్ళల్లోకి సూటిగా చూశాడు. ఒక అయిదు నిమిషాల వరకు దృష్టి తిప్పుకోలేక పోయాడు. తరువాత మెల్లగా తలూపాడు"

"అయితే చివరిరోజుల్లో అతను....."

"అవును చంద్రమ్మా! నేను వారం రోజుల తరువాత కాంప్ నుండి వచ్చాను. వాడి ముఖం తేటగా ఉంది. మనిషి సుఖంగా నిద్రపోతున్నట్లు డాక్టర్లు చెప్పారు."

చంద్రమ్మ ఏడుస్తోంది. పైటతో కళ్ళు ఒత్తుకొని అంది.

"బాబుగారూ! మీరతనిని పెంచారు. అతని మనసు మీకు తెలుసు. భార్యగా నేను తెలుసుకోలేకపోయాను."

"లేదు చంద్రమ్మా! నువ్వు అనురాగంతో వాడిని మార్చాలనుకున్నావు. కాని, వాడికది కొత్త. నా చూపుల్లో అధికారం వాడిని లొంగదీసుకుంది. ఇదీ రహస్యం!"

చంద్రమ్మ ఏమీ మాట్లాడలేదు.

"చంద్రమ్మా! వాళ్ళు మూడు రోజులు మోర్గులో శవాన్నుంచారు. నీ నుండి కబురందిన తరువాత నేనా చివరి పనిచేసి నా ఋణం తీర్చుకున్నాను. యాదగిరి భార్యకు ఈ వూళ్లో ఉద్యోగమివ్వవలసిందని,ఇల్లు కూడా స్టేషనుకు సమీపంలో చూడవలసిందని డివిజనల్ మానేజరుకి ఉత్తరం రాశాను"

చంద్రమ్మ కొంచెం గొంతు సవరించుకొని అంది:

"బాబుగారూ! ఓ విషయం నా మనసులో కొట్లాడుతోంది. మరేమీ అనుకోరంటే చెప్తాను"

"చెప్పు"

"నా భర్త ప్రవర్తనకు నాకిప్పుడో అర్థం తోస్తున్నది. అతను పది సంవత్సరాలు తనది అన్న స్వతంత్రమైన ఆలోచన లేకుండా, అన్ని పనులూ, ఆలోచనలూ మీ కోసమే చేశాడు. ఉద్యోగం దొరికి దూరంగా వెళ్ళిపోగానే, బానిసకు ఒక్కసారి స్వతంత్రం లభించినట్లతనికి అనిపించింది. అప్పటికే అతని స్వయంనిర్ణయశక్తి పోయింది. ఇక నేనో, పుస్తకాలు చదివి సంసారం స్వర్గమన్న భావనతో కలలు కన్నాను. వయసు, అందం, తెలివి ఉన్న దాన్ని. అతనిలో అవి లోపించాయి. పోనీ కనీసం పురుషుడిలో స్త్రీ కోరే ధైర్యం, సాహసం, ప్రేమ, త్యాగం మొదలైన ఉత్తమ గుణాలు కల శక్తి వంతుడు అతడు కాకూడదా అనుకున్నాను. నేను మోసపోయానని తెలుసుకునే సరికి రెండు సంవత్సరాలు గడిచి పోయాయి. బాబుగారూ! ఈ కాపురం విచ్ఛిన్నమవడానికి నేనే కారణమంటారా?"

"చంద్రమ్మా! మీ యిద్దరినీ నేను నిందించ లేను. నువ్వు చెప్పినట్లు నేను ప్రధాన మైన దోషిని. యాదగిరి పట్ల నేను దయతో వ్యవహరించవలసింది. వాడు చేసిన మానవసహజమైన పొరపాట్లను అర్థం చేసుకుని క్షమించి హృదయానికి దగ్గిరగా చేర్చుకోవలసింది. పనివాడిని ఉపేక్ష చేస్తే పాడవుతాడని వాడి పట్ల నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించాను. కాని, నేరం చేయని నువ్వు శిక్షకు గురయ్యావు. నువు చిన్న దానివి. నన్ను మన్నించు"

చివరి మాటలంటుంటే అతని కంఠం బొంగురుపోయింది. చంద్రమ్మ వెంకటేశ్వర్లు చేతులు పట్టుకుంది. కొంగుతో అతని కన్నీళ్ళు తుడిచింది.

"బాబుగారు! అలా అనకండి! మీరు, నేను, యాదగిరి - ముగ్గురమూ దీనిలో నేరస్తులమే."

వెంకటేశ్వర్లు లేచారు - అటుఇటు పచార్లు చేశారు. చంద్రమ్మ అక్కడే కూర్చుంది. అతను తిరిగి ఆమె పక్కను కూర్చున్నారు.

"చంద్రమ్మా! నేనో ముఖ్య మైన పని మీద నిన్ను వెతుక్కుంటూ వచ్చాను. ఆ సంగతే మాటల్లో పడి మరచిపోయాను"

"చెప్పండి బాబుగారూ!"

"యాదగిరి మరో పదిహేను రోజులకు చనిపోతాడనగా,అతనికి కొంత డబ్బు అందింది. అప్పటికి యాదగిరి రాత్రిపూట నిద్రపోతూ చాల వరకు మనశ్శాంతిని పొందాడు. డబ్బందిన మరో నాలుగు రోజులకు నేను వాడిని కలిశాను. అప్పుడు వాడో నిర్ణయం తీసుకున్నాడు. వాడికి ఆరువేల ఒక వంద అరియర్సు దొరికాయి. ఆ డబ్బు నా చేతిలో ఉంచాడు. వంద రూపాయలు తనకు సేవ చే సిన హాస్పిటల్ స్టాఫ్‌కి యిమ్మన్నాడు. వేయి రూపాయలు కొండమీది వాడి హుండీలో వెయ్యమన్నాడు. ఈ రెండు పనులూ అయిపోయాయి."

"చాల సంతోషం బాబుగారూ!"

"కాని ముఖ్యమైనదే ఉండి పోయింది. తాను సుఖంగా ఉన్న రోజులు జ్ఞాపకం చేసుకొని, మరే విధంగా పొందని మనశ్శాంతిని పొందినందుకు వాడు మిగిలిన అయిదువేల రూపాయలు తన భార్యకు యిమ్మని చెప్పాడు. ఈ డబ్బు తీసుకో"

వెంకటేశ్వర్లు అటాచీ లోంచి ఒక నోట్ల కట్ట తీసి చంద్రమ్మ చేతికివ్వబోయాడు.

చంద్రమ్మ ఆ డబ్బు తీసుకోలేదు.

" ఏం చంద్రమ్మా" అతను ఆశ్చర్యంతో అడిగారు.

"బాబుగారూ! ఈ డబ్బు ముట్టుకునే అర్హత నాకు లేదు"

"అదేమిటి చంద్రమ్మా?"

"దీనికి రెండు కారణాలున్నాయి. మొదటిది: నేను మొదటి రోజులలో కూడా అతనిని వచించాను. నా అమ్మాయి కూడా మరొకరి వల్లనే కలిగింది. కాబట్టి నా దంతా నటన. ఇక రెండో కారణం. అతను ఈ డబ్బు తన భార్య కిమ్మన్నాడు. కాని, ఈ రోజు నుండీ నేనతని భార్యను కాను. నేను మెచ్చే పురుషలక్షణాలున్న ఒకరిని ఈ ఉదయమే చిత్తూరులో రిజిష్టర్డు మారేజ్ చేసుకున్నాను. అతనికేదో తొందర పనుండి మద్రాసు వెళ్ళడం చేత నేనీరాత్రి ఉద్యోగానికి వచ్చాను. లేకపోతే రాక పోదును. అందుచేత వీలు చూసుకొని ఈ డబ్బు కూడా కొండమీది వాడికి పంపించండి"

చంద్రమ్మ లేచిపోయింది. కర్టెన్లు పక్కకు లాగింది. తలుపులు బార్లా తెరచింది. ఏదో మరచి పోయినట్లు వెంకటేశ్వర్లు వేపు వచ్చింది.

"బాబుగారూ! చెప్పడం మరచిపోయాను. తోవలో వీలు చిక్కదేమో! ఇంకా బండి పెట్టలేదు. స్నానం చేసి మరీ వెళ్ళండి."

ఎవరో పల్లెటూరి వాళ్ళు తలల మీద మూటలుంచుకొని లోపలికి రాబోయారు.

"ఇది ఫస్టు క్లాసు వెయిటింగ్ రూము! రెండో తరగతి వాళ్ళు రావడానికి వీల్లేదు"

చంద్రమ్మ వాళ్ళను వారించి, చేతి గుడ్డతో కుర్చీలు తుడుస్తూ తన పని ప్రారంభించింది.

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక)

* * *